రూ 2 లక్షలు 40 వేలు కాజేసిన వెలుగు సీఎఫ్

- సొంత డ్వాక్రా గ్రూప్‌లోనూ కన్నం
- స్పందనలో ఫిర్యాదుతో వెలుగులోకి

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం నౌపడ పంచాయతీ పాలనాయుడుపేట గ్రామ సమైక్య సంఘానికి చెందిన వెలుగు సిఎఫ్ పరపటి సుమలత, మహిళా సంఘాలకు సంబంధించిన, సుమారు 2 లక్షల 40 వేల రూపాయలు కాజేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై నౌపడ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి, స్పందనలో ఫిర్యాదు చేయడంతో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. వివరాల్లోకి వెళితే సిఎఫ్ సుమలత గడిచిన మూడు సంవత్సరాల నుండి ఎస్‌హెచ్‌జి (డ్వాక్రా గ్రూప్) సభ్యులు స్త్రీనిధి నుండి తీసుకున్న అప్పును తీర్చడానికి తనకు ఇచ్చిన డబ్బులను, ఆమె సొంతానికి వాడుకుంది. అలాగే సిఐఎఫ్ నిధులు కూడా తన సొంత అవసరాలకు వినియోగించుకుంది. పొదుపు నుండి తీసిన డబ్బులను శ్రీనిధి ఖాతాకు జమచేసి, సమృద్ధి ఖాతాకు మళ్లించకుండా అవసరాలకు వినియోగించుకుంది. ఇలా సంఘాల నుండి రూ.2,40,000 డబ్బులు అవినీతికి పాల్పడినట్లు తేలింది. బాబా గ్రూపు నుండి రూ.45,000 రూపాయిలు, సాగర కన్య గ్రూపు నుండి రూ.48,000, జైసంతోషిమాత గ్రూపు నుంచి

రూ.7500, పెద్దమ్మతల్లి గ్రూపు నుంచి రూ.7500, భాస్కరమ్మ గ్రూపు నుంచి రూ.7500, రామకృష్ణ గ్రూప్ నుంచి రూ.7200, అమ్మ భవాని గ్రూప్ నుంచి రూ.7200, మధుప్రియ గ్రూప్ నుంచి రూ.7200, కొత్తమ్మ తల్లి గ్రూపు నుంచి రూ.8400, నూకాలమ్మ గ్రూపు నుంచి రూ.7200, శ్రీ దత్త గ్రూప్ నుంచి రూ.7500, సాయి సంతోషి గ్రూప్ నుంచి రూ.7500, డబ్బులను తన సొంత అవసరాలకు సీఎఫ్ వాడుకుంది. ఇంతటితో ఆగకుండా తన సొంత గ్రూపైన, లక్ష్మీ గణపతి గ్రూప్ నుంచి రూ.30 వేలను విత్‌డ్రా చేసుకుని సొంతానికి వాడేసుకున్నారు. దీనిపై స్పందనలో జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేయడంతో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. దీనికి సంబంధించి ఎటువంటి రికార్డులు సుమలత వద్ద లేకపోవడంతో, అక్రమాలకు మరింత బలం చేకూర్చాయి. లోను లెడ్జర్, క్యాష్ బుక్, రసీదు బుక్కులు, లేకపోవడం కొసమెరుపు. గ్రూపు సభ్యులు తీర్మానం లేకుండా, బ్యాంకు అధికారులు డబ్బులు ఎలా చెల్లిస్తున్నారో అర్థం కావడం లేదని గ్రూప్ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని డ్వాక్రా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

2,40,000 గుర్తించాం : ఎపిఎం సూర్యనారాయణ... పైవిషయంలో సంతబొమ్మాళి ఎపిఎం సూర్యనారాయణను వివరణ కోరగా సీఎఫ్ సుమలత వివిధ డ్వాక్రా గ్రూపుల నుండి రూ 2,40,000 సొంతానికి వాడుకున్నట్లు గుర్తించామని, దీనికి సంబంధించిన రికార్డులు పలుమార్లు అడిగినా సీఫ్ ఇవ్వడం లేదని తెలిపారు. మండలంలో జరిగే సమావేశాలకు కూడా ఎక్కువ శాతం గైర్హాజరు అవుతుందని అన్నారు. ఆమె స్వంతానికి వాడుకున్న డబ్బులు తిరిగి కట్టించా మని, ఇంకా 24వేల రూపాయిలపై చిలుకు చెల్లించాల్సి ఉందని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా ఆమెను సిఎఫ్ నుంచి తొలగిస్తామని తెలిపారు.

ఉద్యోగుల స్పందన వినతులు సకాలంలో పూర్తిచేస్తాం

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ఉద్యోగుల స్పందనకు వచ్చే వినతులు సకాలంలో పూర్తిచేస్తామని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి ఛాంబర్ లో ఏర్పాటు చేసిన ఉద్యోగుల స్పందన వినతుల స్వీకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉద్యోగులు వివిధ అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని అన్నారు. జీత,భత్యాలు, ఇంక్రిమెంట్లు, బదిలీలు, పదోన్న తులు తదితర సమస్యలపై అర్జీలు అందజేశారు. ఉద్యోగుల గ్రీవెన్స్ కు 4 దరఖాస్తులు అందాయని తెలిపారు.

- ఉద్యోగుల స్పందనకు వచ్చిన వినతులు వివరాలు... బూర్జ మండలం రామ్మన్నపేట గ్రామానికి చెందిన నాస బలరాం 2023 సంవత్సరం బదిలీలలో ఒక టీచర్ 8 సంవత్సరములు పూర్తికాకుండా స్పెషల్ పాయింట్స్ వినియోగించడం వలన తనకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది తగు న్యాయం చేయవలసినదిగా కోరారు. 2019 సంవత్సరంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన వార్డు మహిళలు, బలహీనవర్గాల రక్షణ కార్యదర్శులు, సంక్షేమ, విద్య ఉద్యోగులు - శ్రీకాకుళంజిల్లా కమిటీ వార్షిక ఇంక్రిమెంట్ తమకు మంజూరు కాలేదని, వార్షిక గ్రేడ్ ఇంక్రిమెంట్‌ల మంజూరుకు అవసరమైన చర్య తీసుకోవాలని దరఖాస్తు అందజేశారు. వివిధ పి హెచ్ సిలలో స్టాఫ్ నర్స్ లుగా తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులు, ఉద్యోగంలో చేరి 8 నెలలు అయినప్పటికి జీతాలు అందలేదని, మాతో పాటు ఉద్యోగంలో చేరిన ప్రతి ఒకరికి జీతాలు జమ అయ్యాయని తెలిపారు. జీతాలు జమ కాకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉందని, మాకు జీతాలు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

సంపూర్ణ ఆరోగ్యంతో చంద్రబాబు

న్యాయస్థానానికి తప్పుడు నివేదికలు : మంత్రి డా.సీదిరి

విశాలాంధ్ర-పలాస : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని, అయితే తన ఆరోగ్యం సరిగ్గా లేదని న్యాయ స్థానానికి తప్పుడు నివేదికలు అందజేయ డం ప్రజలు గమనించాలని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శుక్రవారం ప్రగతి భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఉద్దేశ పూర్వకంగా తన న్యాయవాదుల ద్వారా ఇంటి వద్దేనే తప్పుడు పత్రాలు తయారు చేసి కోర్టుకు సమర్పించి తప్పుద్రోవ పట్టించి బెయిల్ పొందాలని చూస్తున్నారని అన్నారు. చంద్రబాబుకు గుండె సంబంధిత ఆరోగ్య సమస్యలుంటే ముందుగా ఎంజోగ్రామ్ చేయించాలని, అలా చేయించకుండా తన స్వార్థప్రయోజనాల కోసం ఆసుపత్రులను వినియోగిస్తున్నారని ఆరోపించారు. ఆయనకు ఉన్న అనారోగ్యంకు జైలు నుంచి విడుదలైన తక్కువ రోజుల్లో ఆపరేషన్ ఎలా చేస్తారని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడు స్కిల్ డవలప్‌మెంట్ స్కామ్‌లో రాజమండ్రి సెంటల్ జైల్లో ఉన్న సమయంలో ఆయన ముసలివాడు అయిపోయాడని, అనేక రోగాలున్నాయని చంద్రబాబు కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు ప్రచారం చేశారని, దీని వెనుక అనేకకుట్ర కోణాలున్నాయని ఆరోపించారు. చంద్రబాబుకు ఎటువంటి అనారోగ్య సమస్యలున్న ప్పటికీ ప్రభుత్వం మాత్రం బహిర్గతం చేయలేదని, ఆయన పరువును కాపాడామన్నారు. బెయిల్ పొడిగింపు కోసం చంద్రబాబునాయుడు డ్రామాలు అడుతున్నాడని, ఆయనకు సంబంధించి జబ్బుకు అవసరమైన మందులు లేవన్నారు. ఒక వేళ ఉంటే అఫిడివిట్‌లో ఎందుకు మందుల పేర్లను పొందుపర్చలేదన్నారు. 2017లో చంద్రబాబు నాయుడు అమెరికాలో వైద్య పరీక్షలు చేయించుకున్నారని ప్రస్తుతం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అనాడు అమెరికా రూప్‌మ్యాప్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు ఎందుకు చూపించలేదని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడు చేస్తున్న మోసాన్ని ప్రజలు, మేధావులు గమనించాలని అన్నారు.

రాష్ట్ర తైక్వాండో పోటీల్లో అదుర్స్ అనిపించండి

- ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ముఖ్య సలహాదారు పి.సుందరరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : రాష్ట్రస్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలలో జిల్లా క్రీడాకారులు విజయబావుటా ఎగురవేసి అదుర్స్ అనిపించేలా పతకాలతో తిరిగి రావాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ముఖ్య సలహాదారు పి.సుందరరావు పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా తెనాలి వేదికగా ఈనెల 18, 19 తేదీలలో ఏపీ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులు శుక్రవారం ఇక్కడ నుంచి పయనమై వెళ్లారు. ఈసందర్భంగా శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జిల్లా క్రీడాకారుల బృందానికి అతిథులు, సంఘ ప్రతినిధులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పి.సుందరరావు మాస్టారు క్రీడాకారులని ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలకు పుట్టినిల్లుగా విరసిల్లుతున్న శ్రీకాకుళం జిల్లాకు ఎంతో ఘన చరిత్ర ఉందని గుర్తు చేశారు. క్రీడా స్ఫూర్తినితో క్రమశిక్షణగా ఆడి, పట్టుదల, అంకితభావంతో తుది వరకు పోరాడాలని సూచించారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి క్రీడాకారులకు బెస్ట్ విశెష్ తెలియజేశారు.

- జిల్లా నుంచి 28 మంది ప్రాతినిధ్యం : భాస్కర్.. తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ కొమర భాస్కరరావు మాట్లాడుతూ రాష్ట్ర పోటీల్లో శ్రీకాకుళం జిల్లా నుంచి 28 మంది బాల బాలికలు ప్రాతినిధ్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. తైక్వాండోలో జిల్లా క్రీడాకారులు సాధిస్తున్న ప్రగతిని వివరించారు. ఇక్కడ రాష్ట్ర పోటీల్లో రాణించి పతకాలు సాధించిన క్రీడాకారులు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్ల డించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉషూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్, ఇస్కాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల నర్సింహులు, కురుటి తారకరామ, సకుముల శివాజీ, కొమర మోహన్ కృష్ణ, పాల్గొన్నవారు. జిల్లా తైక్వాండో బృందానికి కోచ్ మేనేజర్లుగా కురిటి తారకరామా, లక్ష్మణరావు, ముద్దాడ శిరీష వ్యవహరించనున్నారు. రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో సుందరరావు, సాంబమూర్తి, కొమర భాస్కర్ తదితరులు ఉన్నారు.

వ్యాన్ పైనుంచి జారిపడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలంలోని పొన్నాడ గ్రామానికి చెందిన ఇటుకల తయారీ కార్మికుడు తాళ్లవలస సోమేశ్వరరావు 39 ప్రమాదవశాత్తు బొలెరో వ్యాన్ పై జారిపడి తీవ్రంగా గాయపడి గురువారం మృతి చెందాడు ఎస్ ఐ వి సత్యనారాయణ చెప్పిన వివరాల ప్రకారం మద్యానికి బానిసైన సోమేశ్వరరావు గురువారం ఉదయం తన సైకిల్ పై ఇంటి నుంచి బయటికి వెళ్ళాడు మధ్యాహ్నం తన సైకులను బొలెరో వ్యాన్ పై ఎక్కించి అదేవిధంగా తిరిగి ఇంటికి వస్తూ గ్రామానికి సమీపంలో వాహనం నుంచి గుర్తుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు దీనిని గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో ఓ ప్రైవేట్ వైద్యునితో చికిత్స చేయించారు రాత్రి 9 గంటల సమయంలో ఆయన మృతి చెందాడు శుక్రవారం ఉదయం దహన సంస్కారాలు చేసేందుకు కుటుంబ సభ్యులు బంధువులు సిద్ధమవుతుండ గా పోలీసులకు అందిన సమాచారం మేరకు శ్రీకాకుళం సర్వజనసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం శుక్రవారం సాయంత్రం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకి అప్పగించారు మృతునికి ఎవరితోనూ ఎలాంటి వివాదాలు లేవని కూడా ఇటువంటి అనుమానం లేదని మద్యం మత్తులో జారిపడి మృతి చెందాడని కుటుంబ సభ్యులు పోలీసులకి తెలియజేశారు కుటుంబ సభ్యుల నుంచి ఎప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు లేనప్పటికీ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తామన్నారు మృతునికి భార్య రాజేశ్వరి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలి

- ఎంపీపీ ప్రతినిధి, వైయస్ఆర్సిపి మండల కన్వీనర్ కడియాల ప్రకాష్

విశాలాంధ్ర-కవిటి: ప్రజల ఆరోగ్యంపై వైద్యులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని మండల ఎంపీపీ ప్రతినిధి,వైసీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని బొరివంక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వైద్యం పైన ప్రత్యేకమైన శ్రద్ధ వహిస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే తలంపుతో ఉన్నారని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో రోగులను గుర్తించామో అటువంటి పేదవారికి మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. అలాగే విలేజ్ హెల్త్ క్లినిక్స్104, 108 మొదలగు వాటి ద్వారా సేవలను మరింత విస్తృతం చెయ్యాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వి సూర్య నారాయణ, తాసిల్దార్ పి శేఖర్, స్థానిక సర్పంచ్ శ్రీరామ్ ప్ర సాద్, ఏఎంసీ వైస్ చైర్మన్ నీలయ్య, స్థానిక ఎంపీటీసీ దుద్ది సతీష్, వైద్యులు మాదిన హరిత, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

విశాలాంధ్ర -జలుమూరు: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీతోపాటు చల్లపేటలోని విజ్ఞాన దుర్గా జూనియర్ కళాశాలలో స్విప్ ఎలక్షన్ ప్రోగ్రామ్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల తహశీల్దార్‌తోపాటు డిప్యూటీ తహశీల్దార్ కళాశాల ప్రిన్సిపాల్, స్రాఫ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు తెప్పోత్సవం ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర-అరసవల్లి: ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత శ్రీ సూర్యనారాయణ స్వామి వారి దేవాలయ ఇంద్రపుష్కరిణి లో ఈ నెల 24 వ తేదీన జరగనున్న స్వామి వారి హంసనావికోత్సవం (తెప్పోత్సవం) ఆహ్వాన పత్రికను ఆలయ పాలకమండలి చైర్మన్ ఇప్పిలి జోగి సన్యాసిరావు, ఆలయ ప్రధాన అర్చకులు అండ్ ఎక్స్ అఫీషియో మెంబర్ ఇప్పిలి శంకర శర్మ, ఆలయ పాలకమండలి సభ్యుల సమక్షంలో రేపు అనగా తేదీ:18-11-23 శనివారం ఉదయం 10 గంటలకు ఆలయ అనివెట్టి మండపంలో అవిష్కరించనున్నట్లు ఆలయ ఈవో వి.హరి సూర్య ప్రకాష్ తెలిపారు.

ప్రేమికులు ఆత్మహత్య

విశాలాంధ్ర-పలాస : పలాస రైల్వేస్టేషన్ వద్ద శుక్రవారం రాత్రి కదులుతున్న గూడ్స్ రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం తెలుసుకున్న పలాస జీఆర్‌పి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం కోసం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతులు పశ్చిమబెంగాళ్ రాష్ట్రంకు చెందిన షేరింగ్ తాషి సేర్పా, రంజనారాయ్‌గా గుర్తించారు. ఈ ఘటనపై వివరాలు తెలియాల్సి ఉంది.

ధాన్యం కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర-జలుమూరు : ఏడాది ఖరీఫ్ సీజన్లో పండించిన ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. పది రోజులుగా వరి చేయను కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయని, అమ్మకానికి సిద్ధంగా ధాన్యం ఉన్నప్పటికీ కొనుగోలు జరగడంలేదని రైతులు వాపోతున్నారు. ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో దళారులకే ధాన్యం విక్రయించాల్సి వస్తుందని రైతుల ఆందోళన చెందుతున్నారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లోనూ ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల కోరుతున్నారు.

సీ.హెచ్.సిని ఐటీడీఏ పీవో తనిఖీ

విశాలాంధ్ర-పాతపట్నం : సీహెచ్ సీని ఐటిడిఎ పీవో కల్పనకుమారి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వార్డులను పరిశీలించారు. వైద్యులు మరియు సిబ్బంది యొక్క హాజరును పరిశీలించారు. ఆసుపత్రి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రిలోని మెడికల్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు డిస్పోజ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆరోగ్య శ్రీ పథకంపై ప్రజలకు పూర్తి అవగాహన కలిగించాలని అన్నారు. నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి అదనపు భవనాలను ఈ నెలాఖరుకు పూర్తి చేసి అప్పగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగులచవితి

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని కవిటి,జగతి,బెజ్జి పుట్టుగ, బొరివంక, ప్రగడపుట్టుగ తదితర గ్రామాల్లో నాగుల చవితి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేకువజామున భక్తులు తల స్నానం ఆచరించి గ్రామ శివార్లలో ఉండే పుట్టల వద్దకు చేరుకొని భక్తిశ్రద్ధలతో పాలు, కోడి గ్రుడ్డు, వడపప్పు, చలిమిడి, పాయసం నాగేంద్రునికి నైవేద్యాలు సమర్పించి పూజలు చేపట్టారు. ఈ పూజ చేయడంవల్ల అష్టఐశ్వర్య, ఆయురారోగ్య, భోగభాగ్యాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం.

డస్ట్‌బిన్ల పంపిణీ

విశాలాంధ్ర-మెళియాపుట్టి: జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన డస్ట్ బిన్ లను మండల ఎంపీపీ ప్రతినిధి బైపోతు ఉదయ్ కుమార్ శుక్రవారం పంపిణీ చేశారు. డస్ట్ బిన్ల వంపిణీ కంటే ముందు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించి గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలకు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఈ డస్ట్ బిన్ పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి ఉదయ్ కుమార్ తోపాటు మండల విస్తరణధికారి, ఏవో, పలువురు సర్పంచులు ప్రజాప్రతినిధులు కార్యదర్శులు, సిబ్బంది తదితరులున్నారు.

తెంబూరు పరిధి సమీప గ్రామాలలో పెద్దపులి సంచారం

విశాలాంధ్ర-పాతపట్నం: మండల పరిధిలో పెద్ద పులి సంచరిస్తున్నట్టు ఫారెస్ట్ అధికారులు తెలియచేస్తున్నారు. పాతపట్నం మండలం తెంబూరు వద్ద యేనేటిపేట, సవర సోర్లిగం సమీప పంట పొలాల్లో గురువారం సాయంత్రం పెద్దపులి పాద ముద్రలను గుర్తించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న అధికారులు ఘటన స్థలానికి చేరుకొని పులి పాద ముద్రలను గుర్తించి పెద్దపులి సంచారం వాస్తవమేనని సమీప ప్రాంత ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. శుక్రవారం పెద్ద పులి ఏ ప్రాంతంలో సంచరిస్తోందో ఎక్కడ ఉందో గుర్తించే పనిలో అటవీశాఖ అధికారులు సిబ్బంది ఉన్నారు.

హుదూద్ ఇళ్ల కేటాయింపులో జాప్యం ఎందుకు...? : జనసేన నాయకులు

విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన హుదూద్ ఇళ్లు కేటాయింపులో జాప్యం ఎందుకు చేస్తున్నారని, తక్షణమే తుఫాన్ వలన నష్టపోయిన బాధితులకు ఇళ్లు మంజూరు చేయాలని జనసేన నాయకులు హరీష్‌కుమార్ శ్రీకాంత్ కోరారు. శుక్రవారం హుదూద్ ఇళ్లును పరిశీలించిన అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ హుదూద్ తుఫాన్ వలన నష్టపోయిన బాధితులకు ఇళ్లు మంజూరు చేస్తామని పలాస నియోజకవర్గంలో పరిశ్రామికవాడ సమీపంలో, బెండి పంచాయతీ పరిధిలో ఇళ్లు నిర్మాణం చేపట్టారు. హుదూద్ తుఫాన్ వచ్చి 9 ఏళ్లు అవుతున్నా ఇంకా బాధితులకు ఇళ్లు ఇవ్వకపోవడం ఏంటని ప్రభుత్వాన్ని పరిశీలించారు. హుదూద్ తరువాత, తిత్లీ తుఫాన్లు వచ్చి ఇంకా నష్టాన్ని మిగిల్చింది అని గుర్తు చేశారు. కరోనా లాక్‌డౌన్ సలమయంలో అద్దెలు కట్ట లేక చాలా మంది ఇబ్బంది పడ్డారని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలని, లేకపోతే స్థానిక నాయకులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకు వెళ్లడానికి వెనుకాడబోమని అన్నారు. ఆయనతో పాటు విశ్రాంతి ఎస్.ఐ కొన కృష్ణారావు, జనసేన నాయకులు సందీప్, గిరిబాబు, కిరణ్‌లు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందజేయాలి

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషా

విశాలాంధ్ర-మందస : మందస మండలంలో పంటలు పూర్తిగా ఎండిపోయాయని, రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి కరువు మండలంగా ప్రకటించాలని రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషా అన్నారు. శుక్రవారం మండలం పిడిమందస పంచాయితీ మధ్య, నర్సింగపురం పంచాయతీ దేవపురం, నర్సింగపురం, టంగరపుట్టి గ్రామాల్లో నిర్వహించిన భవిష్యత్ గ్యారెటీ, బాబు సూరిటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసం దర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ కాలంలో వర్షాలు లేక రైతులు పెట్టిన పెట్టుబడులు రాక రైతులు దిగులుతో ఉన్నారని, అయినా వైసీపీ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని అన్నారు. తక్షణమే పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రవేశ పెట్టిన మినీ మేనిఫేస్టోలోని సూపర్ 6 పథకాలు, టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మహాశక్తి పథకం ద్వారా, ప్రజలకు అందించే పథకాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భావన దుర్యోదన, తమిరి భాస్కరరావు, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, ఎం.నవీన్‌కుమార్, అగ్గన్న జయరాజు, గేదెల రామక్రిష్ణ, డొక్క లక్ష్మీనారాయణ, సీర గిరిధర్, భాస్కర్ గౌడ, సవర లఖియా, శంకర్, మోహన్‌బాబు, ప్రశాంత్, విజయ్‌కాంత్, నాగేంద్రలు పాల్గొన్నారు.

యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-నరసన్నపేట : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం యుటిఎఫ్ నరసన్నపేట మండల కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా, ఏ.ఆర్.ఆర్.భూషణరావు, అధ్యక్షులుగా, టేకి సుధీర్‌కుమార్, సహా అధ్యక్షులుగా, రోణంకి బాబురావు, బి.విశాలాక్షి, ప్రధాన కార్యదర్శిగా, కుంచి ఆదినారాయణ, కోశాధికారిగా, పూతి కృష్ణారావు, కార్యదర్శులుగా, బి.సూర్యప్రకాష్, పి.తిరుమలరావు, వి.మన్మధరావు, పి.రమేష్‌పట్నాయిక్, కె.రమణ, బివిర్రాజు, ఎన్.ఉత్తరుడు, ఎం.రాజారత్నం, కె.రఘు, టి.తాతన్నాయుడు, బి.శ్యామ్, పి.సత్యన్నారాయణ, జిల్లా కౌన్సిలర్‌గా, బి.తౌడు, కె.హరినారాయణ, ఎన్.సింహాచలం, జె.రమేష్, దంత లక్ష్మణరావు, వి.రామారావు, కె.వి.చిన్నికృష్ణ ఎన్నికయ్యారు. ఆడిట్ కమిటీ సభ్యులుగా పి.వేణుగోపాలరావు, షేక్ షాజహాన్, షేక్ నజరుద్దీన్ ఎంపిక చేయబడ్డారు. వీరు ఒక సంవత్సరం కాలం పాటు పదవీలో వుంటారు. అనంతరం నూతన అధ్యక్షులు, టేకి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ కోటబొమ్మాళిలో డిసెంబర్, 3వ తేదీన జరిగే కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు, పొందూరు అప్పారావు, జిల్లా కోశాధికారి, బమ్మిడి శ్రీరామమూర్తి, ఎన్నికల పరిశీలకులుగా, కోరాడ వైకుంఠరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, ఆర్.దమయంతి తదితరులు హాజరయ్యారు.

ఓటు వజ్రాయుధం... ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి : తహసీల్దార్

విశాలాంధ్ర-కవిటి : ఓటు వజ్రాయుధం లాంటిదని దానిని ప్రతి ఒక్కరూ సక్రమంగా వినియోగించుకోవాలని తహసిల్దార్ పి.శేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కవిటిలో తహసిల్దార్ పి.శేఖర్ ఆధ్వర్యంలో ఎన్.వి.జె విద్యాసంస్థలు ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులకు ఓటు హక్కు పై అవగాహన కల్పించారు. అనంతరం తహసీల్దార్ శేఖర్ మాట్లాడుతూ ఒక ఓటు దేశ గమనాన్నే మారుస్తుందన్నారు. యువతలో చైతన్యం వచ్చి ఓటు హక్కును సమర్థంగా వినియోగించుకున్న నాడే దేశాభివృద్ధి సాధ్యం అన్నారు.అయితే యువ ఓటర్ల నమోదు ప్రతిసారీ అంతంత మాత్రంగానే కనిపిస్తోందని.యువత మేలుకొని ఓటు హక్కు నమోదుకు ముందుకు రావాలని కోరారు.ప్రతి ఒక్కరూ తమకు ఓటు హక్కు ఉందో, లేదో చూసుకుని దరఖాస్తు చేసుకోవాలని కోరారు. తమ ఓట్లను పరిశీలించు కోవచ్చని ఓటు లేనివారు కొత్తగా ఫారం-6 ద్వారా ఓటు హక్కును పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విజె విద్యా సంస్థల మేనేజ్‌మెంట్ బివివి ప్రసాదరావు, ప్రిన్సిపాల్ భాస్కరరావు, ఏ ఓ జోష్ కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'బాబుతోనే భవిష్యత్తు' పై ప్రచారం : టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-ఆమదాలవలస : రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబుతోనే సాధ్యపడుతుందని తెలుగుదేశం మండల పార్టీ నాయకులు తమ్మినేని చంద్రశేఖర్ నూకరాజు అన్నారు. శుక్రవారం దూసి రైల్వేస్టేషన్ ధరలు బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ ఆవేశం పై జనసేన టిడిపి ఉమ్మడి కార్యాచరణలో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఒక్క ఛాన్స్ అని ప్రజలను నమ్మించి అధికారం చేపట్టిన తర్వాత అన్ని వర్గాల వారిని వైసిపి అణగదొక్కిందని విమ ర్శించారు. తెలుగుదేశం పార్టీకి మద్దతు అందించాలని కోరారు. ఇంటింటికి తిరిగి టిడిపి అనుసరించే విధానాలను వివరించారు. పార్టీ అధికారంలో వచ్చిన తరువాత ప్రతి లబ్ధిదారునికి ఎంత మొత్తం లబ్ధి చేకూరుతుందని వివరించడం జరిగింది. ఈ కార్య క్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు తమ్మినేని అప్పలనాయుడు కంచరన లోకేశ్వరరావు, కోటినాయుడు, బాబురావు జనసేన నాయకులు మురపాక రాజశేఖర్, గౌతమ్ తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు చాకిపల్లి విద్యార్థులు

విశాలాంధ్ర-టెక్కలి : రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చాకిపల్లి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు బాడాన నారాయణరావు తెలిపారు. రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ రగ్బీ బాలు అండర్-14 ఇయర్స్ పోటీలకు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల చాకిపల్లి విద్యార్థులు పి.పార్థసారథి, డి.యశ్వంత్ కుమార్ 8వ తరగతి విద్యార్థులు, చాకిపల్లి అక్షయ్ 7 వ తరగతి విద్యార్థి ఎంపికయ్యారని ఎంపికైన విద్యార్థులు ఈనెల 18వ తేదీ నుండి 20వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ రాష్ట్ర పోటీలు కర్నూలు జిల్లా కర్నూలు టౌన్ రగ్బీ క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు ఎం. అనురాధ, ఉపాధ్యాయు పి.జగదీశ్వరరావు, కె.దాలయ్య, కే.నారాయణరావు, పి.చిన్నారావు, పి.ఋషి, బి.ఆనంద్‌రావు, కే.సుధారాణి, సిహెచ్.భారతి, టి.వైకుంఠరావు, ఎస్.దుర్గారావు, ఎం.మోహిని, వ్యాయామ ఉపాధ్యాయుడు బాడాన నారాయణరావు, పీఈటి ఎస్.రమేష్, క్రాంతి, పాఠశాల సిబ్బంది అభినందించారు.

ముఖ్యమంత్రి పర్యటన వాయిదా : కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ఈనెల 23న జిల్లాలోని పలాస నియోజకవర్గంలో జరగాల్సిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పర్యటన వాయిదా పడినట్లు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఇది తాత్కాలిక వాయిదా మాత్రమేనని త్వరలోనే సీఎం పర్యటన వివరాలను తెలియజేస్తామని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా పలాసలో ఉద్దానం మంచినీటి పథకం, కిడ్నీ రీసెర్చ్ సెంటర్లను ప్రారంభించాల్సి ఉంది. త్వరలోనే సంబంధిత తేదీలను తెలియజేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

జగన్ రావాలి... బడుగులకు న్యాయం జరగాలి : ఎంపీపీ

విశాలాంధ్ర -సోంపేట/కంచిలి : సమాజంలో అట్టడుగున ఉన్న బడుగు, బలహీనవర్గాలకు న్యాయం జరగాలంటే, వారికి అభివృద్ధి ఫలాలు దక్కాలంటే రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రి జగన్ రావాలని కంచిలి ఎంపీపీ దేవదాసురెడ్డి పిలుపునిచ్చారు. కొల్లూరు సచివాలయం పరిధిలో శుక్రవారం జగనే ఎందుకు రావాలంటే కార్యక్రమాన్ని పార్టీ నాయకులతో కలిసి నిర్వహించారు. గత తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో అణగారిన వర్గాలను అణగదొక్కి అగ్ర వర్ణాలను అందలం ఎక్కించారని విమర్శించారు. జగన్ మాత్రం ముఖ్యమంత్రిగా అన్ని సామాజికవర్గాలకు న్యాయం చేస్తూ అంబేద్కర్, మహాత్మాగాంధీ కలలు గన్న సమసమాజ నిర్మాణానికి నిర్విరామంగా కృషి చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా అనేక కుటుంబాలను సందర్శించి ప్రభుత్వపరంగా వారికి అందుతున్న పథకాలు, అందకుండా ఉన్న పథకాలు గూర్చి చర్చించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ వజ్జ మృత్యుంజయరావు, కొనపల సురేష్, సర్పంచ్ పైల లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏనేటి కొండలను ఎస్టీలుగా గుర్తించాలి

రాష్ట్ర కళింగ కర్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలంలో పలు పంచాయతీలలో నివాసముంటున్న ఏనేటి కొండలు సుమారు 15 సంవత్సరాలుగా ఏకులానికి చెందక నిరుద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారికి గతంలో వలే ఎస్టీలగా గుర్తించాలని రాష్ట్రకళింగ కార్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు కలెక్టర్‌కు కోరారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లాకలెక్టర్ శ్రీకేష్ బి లాఠకర్ ఆద్వర్యంలో నిర్వహించిన బీసీకుల గణ సమీక్ష సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అద్యక్షుడు ధర్మాన క్రిష్ణదాసు, రాష్ట్ర కళింగ కార్పోరేషన్ చైర్మన్ పేరాడ తిలక్‌లు ముఖ్యఅతిధిలుగా పాల్గన్న ఈ సమావేశానికి హేమసుందరరాజు హాజరైయ్యారు. టెక్కలి నియోజకవర్గం కోటబొమ్మాళి మండలం పరిధిలో పలు పంచాయతీలలో ఏనేటి కొండలు ఉన్నారని వారు గతంలో ఎస్టీకులంగా ఉండేవారని, ప్రస్తుతం వారికి ఏ కులం లేక, ఈ కులానికి చెందిన విద్యార్థులు, నిరుద్యోగులు ఏ కుల దృవీకరణ సర్టిఫికేట్లు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి పాత పద్దతిలాగానే ఎస్టీకులంలో చేర్చి కుల దృవీకరణ పత్రాలు అందించాలని క్రిష్ణాదాసు, తిలక్‌ల అద్వర్యంలో కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళానని, దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించి త్వరలో ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ మాట ఇచ్చారని హేమసుందరరాజు తెలిపారు.

రోడ్ల దుస్థితిపై జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ చైతన్య

విశాలాంధ్ర-మెళియాపుట్టి : రాష్ట్రంలో మిగతా రంగాలతో పాటు రోడ్ల పరిస్థితి పూర్తిగా కుంటుపడిందని తెలియజేస్తూ, పూర్తిగా అద్వాన్న పరిస్థితిలో ఉన్న రోడ్డుపై టిడిపి, జనసేన పార్టీలు కలిసి సంయుక్తంగా నిర్వహించనున్న గుడ్ మార్నింగ్ సీఎం కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జనసేన పార్టీ పాతపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ గేదెల చైతన్య అన్నారు. మెళియాపుట్టి మండలం, చాపర గ్రామంలో జనసేన, టిడిపి పార్టీల నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ ఆదివారం నాడు మండలంలోని రోడ్లపరిస్థితి పై జరగనున్న కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆదివారం నాడు జరగనున్న కార్యక్రమం సంబంధించి పలు అంశాలపై మాట్లాడారు. ఈ సమావేశంలో గేదెల చైతన్యతో పాటు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు భాస్కర్ గౌడ్, జనసేన నాయకులు దుక్క బాలరాజు, పడాల శ్రీను, చింతల ప్రశాంత్, పిట్ట హరికృష్ణ, నరేష్, పైల రవి, పలువురు తెలుగుదేశం జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చేసినవారు ఎవరైనా నేరస్తులే...

బ్రెడ్స్ ప్రతినిధి లోకనాథ్

విశాలాంధ్ర-కవిటి : బాల్యవివాహాలు చేసిన వారు ఎవరైనా నేరస్తులే అని బ్రెడ్స్ ప్రతినిధి లోకనాథ్ గ్రామాల్లో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈమేరకు శుక్రవారం మండలంలోని కళింగపట్నం గ్రామంలో బ్రదర ఆర్గనైజేషన్, కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. చట్ట ప్రకారం 18 ఏళ్లు నిండని అమ్మాయికి 21 సంవత్సరం నిండని అబ్బాయికి జరిగే వివాహాన్ని బాల్య వివాహంగా పరిగణించబడుతుందన్నారు. అటువంటి వివాహాన్ని తల్లిదండ్రులు, సంరక్షకులు, పురోహితులు, స్నేహితులు, ఇరుగుపొరుగువారు, బాల్య వివాహానికి అనుమతించిన కులపెద్దలు, వివాహ ఏర్పాట్లకు సహకరించిన వారందరూ నేరస్థులే అని లోకనాథ్ తెలిపారు. పెళ్లికి హాజరైన వారుకూడా నేరస్థులవుతారని వివరించారు. ఈ నేరస్థులకు రెండేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష పడవచ్చు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్ పరీక్షలో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : దేశవ్యాప్తంగా నిర్వహించిన ఒలంపియాడ్-2023 (నాలెడ్జ్ అసెసమెంట్ టెస్ట్) పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు మంచి ఫలితాలను సాధించారని మహాలక్ష్మీనగర్ కోలనీ శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.రాంప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలో నిర్వహించిన ఒలింపియాడ్‌లో అత్యధికంగా 260 మంది విద్యార్థినీ,విద్యార్థులు సెకెండ్ లెవెల్‌కు అర్హత సాధించి అద్వితీయమైన ప్రతిభను కనబరిచారని దేశంలోని మరే ఇతర విద్యాసంస్థ ఇంతటి ఫలితాలను సాధించలేదన్నారు. ఈ ఫలితాలతో భారతదేశంలో శ్రీ చైతన్య నం.1 అని మరో సారి నిరూపితమైందని పేర్కొన్నారు. మేథ్స్ విభాగం నుండి 85 మంది విద్యార్థినీ విద్యార్థులు, ఫిజిక్స్ విభాగం నుండి 73 మంది, కెమిస్ట్రీ విభాగం నుండి 102 మంది విద్యార్థినీ, విద్యార్థులు సెకెండ్ లెవెల్‌కు అర్హత సాధించి ఎంపికయ్యారని క్యాంపస్ మొత్తము సెలెక్షన్స్ 260 మంది విద్యార్థినీ విద్యార్థులు సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా శ్రీ చైతన్య విద్యా సంస్థల రీజనల్ ఇంచార్జి ఎస్.రామినాయుడు, ఉత్తరాంధ్ర జిల్లాల కో ఆర్డినేటర్ ఏ.బాలరాజు, జోనల్ అకడమిక్ డీన్ పి.మోహన్‌బాబు, పాఠశాల అకడమిక్ డీన్ సి.హెచ్.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఇంద్ర మౌళి, ఐపియల్ ఇంచార్జి బి.జనార్ధన్, సి భ్యాచ్ ఇన్‌చార్జి ఎస్.లక్ష్మీకాంత్ సివిల్స్ బ్యాచ్ ఇన్‌చార్జి బి.ప్రసాద్, మెడికాన్ ఇన్‌చార్జి టి.రామ్మోహన్, పాఠశాల ఏ.ఓలు పి.శ్రీనివాసరావు, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విధ్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించిన గ్రంధాలయ శాఖాధికారి

విశాలాంధ్ర-నరసన్నపేట : స్థానిక శాఖ గ్రంథాలయంలో శుక్రవారం పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలను శాఖ గ్రంథాలయాధికారి, ఛాయారతన్ నిర్వ హించారు. జాతీయ గ్రంథాలయ వారోత్స వాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో ముఖ్య అతిధిగా జిల్లా గ్రంథాలయ సంస్థ, కార్యదర్శి, బి.కుమార్‌రాజు హాజరయ్యారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆంగ్ల ఉపాధ్యాయులు, టి.బాబురావు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బిజేపి ఓబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎండ

విశాలాంధ్ర-నరసన్నపేట : భారతీయ జనతా పార్టీ జిల్లా ఓబిసి మోర్చా ప్రధాన కార్యదర్శిగా, ఎండ శ్రీనివాసరావును బిజేపి మోర్చా జిల్లా అధ్యక్షులు, కరుణాకరరావు నియామకం చేశారు. శనివారం శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజక వర్గంలో చేతివృత్తిదారులకు కేంద్ర ప్రభుత్వం పథకాలను అందేవిధంగా కృషి చేస్తానని ఆయన అన్నారు. అలాగే ఓబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా నన్ను నియమించినందుకు బిజేపి ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు, కరుణాకర్‌కు, రాష్ట్ర ఓబిసి అధ్యక్షులు, గోపి శ్రీనివాస్‌కు, ఉత్తరాంధ్ర జోన్ లా ఇంఛార్జ్, రౌతు చిరంజీవికి. జిల్లా బిజెపి అధ్యక్షులు, ఉమామహేశ్వరరావుకు, జిల్లా పార్టీ పెద్దలైన పూడి తిరుపతిరావుకు, పైడి వేణుగోపాలరావుకు, అట్టాడ రవిబాబ్జీకు, నరసన్నపేట నియోజకవర్గ బిజేపి కన్వీనర్, గొద్దు భాగ్యలక్ష్మికి ధన్యవాదాలు తెలియచేశారు.

రాష్ట్రానికి స్వర్ణయుగం తెదేపాతోనే సాధ్యం

భవిష్యత్తుకు బాబు గ్యారెంటీ కార్యక్రమంలో బోయిన రమేష్

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : రాష్ట్రానికి స్వర్ణయుగం రావాలంటే తెలుగుదేశం పార్టీ, నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమవుతుందని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటువేయాలని మండల టీడీపీ అద్యక్షుడు బోయిన రమేష్ అన్నారు. శుక్రవారం కోటబొమ్మాళి మేజరు పంచాయతీ పరిధిలోగ ప్రకాష్‌నగర్ కాలనీ, విద్యుత్‌నగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ బాండ్లను టిడిపి నాయకులతో కలిసి అందజేశారు. అలాగే ప్రతి ఇంటికి తిరిగి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానూ చేపట్టబోయే పథకాలు గురించి ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాగానే తల్లికి వందనం పేరుతో మీ ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒకొక్కరికి ఏడాదికి రూ. 15వేలు, ఆడబిడ్డ నిధి నుంచి 18 ఏళ్ళు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ. 1500లు దీపం పేరుతో ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్‌లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 20 లక్షల మంది యువతకు ఉపాధి, నిరుగ్యోగులకు యువగళం నిధి నుంచి నెలకు రూ. 3వేలు నిరుద్యోగ భృతి, ప్రతి రైతుకు ఏటా రూ. 20వేలు ఆర్థిక సహాయం తదితర సంక్షేమ పథకాలు అందించటం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మజ్జి క్రిష్ణారావు, మూగి అచ్చయ్యరెడ్డి, కోరాడగోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వీకుల ఆచారాలను భావితరాలకు అందిద్దాం

నాగేంద్రునికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : పూర్వీకుల అచార వ్యవహారాలను భావితరాలకు అందిద్దామని శ్రీకాకుళం పార్లమెంటు సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఆయన శుక్రవారం తన స్వగ్రామం నిమ్మాడకు చేరుకొని కుటుంబ సభ్యులతో కలిసి నాగులచవితి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీతో పాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు సతీమణి, నిమ్మాడ మాజీ సర్పంచ్ కింజరాపు విజయమాధవి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివర ప్రసాద్‌లు వారి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగులు చవితి సందర్భంగా వాడవాడల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. నాగుల చవితి సందర్భంగా తయారు చేసిన చలివిడి, వడపప్పు, తదితర పిండి వంటలతో ఇంటిల్లాపాది పొలాల్లోను, తోటల్లోనూ ఇంటి పెరడల్లోను ఉన్న పుట్టల వద్దకు వెళ్ళి ప్రత్యేక పూజలు నిర్వహించి నాగన్న కోసం కోడి గుడ్లు, పాలు, చలివిడి పుట్టలో వేసి అందులో ఉన్న నాగుపాములకు కదలిక రావాలని బాణసంచా పేల్చటం విశేషం. ఈ చవితి రోజున పుట్టలో పాలు పోసి గుడ్లు వేయటం వల్ల చెవులకు సంబందించిన వ్యాధులు రావని, వచ్చిన వ్యాదులు నయమవు తాయని ప్రజలు నమ్ముతారు. అలాగే చవితి రోజు నాగుపాము కనిపిస్తే ఆ కుటుంబానికి శుభం చేకూరి సుభ్రమణ్యస్వామి ఆశీస్సులు లభిస్తాయని వేద పండితులు చెబుతున్నారు. ఇక చవితి పండగ సందర్భంగా మధ్యాహ్నం మహిళలంతా పంట పొలాలకు వెళ్ళి పూజలు నిర్వంచటం వల్ల యేడాది మొత్తం పంటలు సమృద్ధిగా ఉంటాయని భావిస్తున్నారు.

మంత్రి డా.సీదిరి, ఛైర్మన్ బల్ల మధ్య రాజకీయ దూరం..?

విశాలాంధ్ర-పలాస : రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు పలాస కాశీబుగ్గ కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు మధ్య మళ్లీ రాజకీయ విభేదాలు మొదలైనట్లు స్థానికంగా ప్రచారం జరుగుతుంది. గతంలో వీరిద్దరి మధ్య ఉన్న వివాదం 6 నెలల క్రిందట మధ్య వర్తుల ద్వారా సర్దుమణిగింది. మళ్లీ ఇటీవల వీరిద్దరి మధ్య రాజకీయ దూరం పెరుగుతోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పాల్గొనే కార్యక్రమాలకు పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు దూరంగా ఉంటూ వస్తుండడంతో వీరి ఇద్దరి మధ్య సఖ్యత లేదనే ప్రచారం జోరుగా సాగుతోంది. మంత్రి డాక్టర్ సీదిరి అనుచరులు మున్సిపాలిటీ పాలన రంగంలో జోక్యం చేసుకొని తనకు అధికారాలు లేకుండా చేస్తున్నారని, చైర్మన్ బల్ల గిరిబాబు అనుచరులు ఆరోపిస్తున్నారు. ఇటీవల మున్సిపాలిటీ పరిధిలో జరిగిన అనేక కార్యక్రమాలకు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పాల్గొన్నా ఆయన వెంట చైర్మన్ గిరిబాబు లేకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. ఇటీవల జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్ర సమావేశానికి చైర్మన్ గిరిబాబును అధ్యక్షత వహించినా ఆయన సుముఖతగానే ఆ సభకు హాజరైనట్లు తెలుస్తోంది. ఇటీవల తన వార్డు పరిధిలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా చైర్మన్ గిరిబాబు లేకుండానే మంత్రి ఆవిష్కరించారని, దాంతో గిరిబాబు తీవ్ర మనస్థాపానికి గురైనట్లు తెలుస్తోంది. ఈనెల 23న ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పలాస వస్తున్న సందర్భంగా శుక్రవారం ప్రగతీ భవన్ ఆవరణలో నియోజకవర్గ నాయకులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో చైర్మన్ గిరిబాబు పాల్గొనలేదని తెలుస్తోంది. అయితే మంత్రి డాక్టర్ సీదిరి, చైర్మన్ బల్ల గిరిబాబుల మధ్య ముఖ్యమంత్రి రాక సందర్భంలో సఖ్యత కుదురుతుందో లేదో వేచిచూడాలి.

ఘనంగా వృశ్చిక సంక్రమణం పూజలు

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని జగతి గ్రామంలో వెలసి ఉన్న గ్రామ దేవత శ్రీ మరల పోలమ్మ అమ్మవారి ఆలయం వద్ద వృశ్చిక సంక్రమణ పూజలు గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేకువ జామున నుండి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని కుంకుమ పూజలు కార్యక్రమం చేపట్టారు.భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఘనంగా నాగుల చవితి

విశాలాంధ్ర-పాతపట్నం : నాగుల చవితి పర్వదినం సందర్భంగా పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి గ్రామ దేవత శ్రీ నీలమణి దుర్గ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నాగ దేవత నిలయమైన పుట్టలో పాలు పోసి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఆమెతో పాటు పాతపట్నం మండల వైసిపి అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, మండల జె.ఏస్.సి కన్వీనర్ ఎనుగుతల సూర్యం పాతపట్నం మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ ఏస్.మమత, ఎం.రామకృష్ణ వైసిపి నాయకులు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరికీ నాగుల చవితి శుభాకాంక్షలు తెలిపారు.

మెళియాపుట్టి: మండలంలోని గ్రామాల్లో నాగుల చవితి వేడుకలు ప్రజలు ఘనంగా నిర్వహించారు. నాగులచవితి సందర్భంగా శుక్రవారం నాడు భక్తులు ఉదయాన్నే పుట్టల వద్దకు చేరుకొని నాగదేవతలను పూజించి నాగుల చవితిని ఘనంగా జరుపుకున్నారు. హిందూ సంస్కృతిలో ఈ పవిత్రమైన రోజుకు విశిష్టమైన ప్రాముఖ్యత ఉంది. ఇది దీపావళి తరువాత వచ్చే పండుగ.

వైసీపీ పాలనతో రాష్ట్రం అదోగతి

- మాజీ శాసన సభ్యులు బగ్గు రమణమూర్తి, - జనసేన నాయకులు

విశాలాంధ్ర-పోలాకి: వైసీపీ పాలనతో రాష్ట్రం అదోగతి పాలైందని, అభివృద్ధి లో వెనుకంజులో ఉందని, బాబు స్యూరిటీ తోనే రాష్ట్ర భవిష్యత్తు గ్యారంటీ అని నరసన్నపేట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి అన్నారు. కార్యక్రమంలో భాగంగా గుప్పడిపేట గ్రామంకు విచ్చేసిన బగ్గు రమణమూర్తికి టీడీపీ -జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో గల విధుల్లో పర్యటించి చంద్రబాబు పవన్ కళ్యాణ్ ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. మహిళలకు ఏర్పాటుచేసిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని ప్రస్తుత రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, దోపిడీలు, హత్యలు, గూర్చి వివరించారు. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పల నాయుడు, జనసేన నాయకులు,నియోజకవర్గ సమన్వయ కర్త బలగ ప్రవీణ్ కుమార్ మండల అధ్యక్షులు నందుపిల్లి దండాసి సీనియర్ నాయకులు, బైరి భాస్కర్ రావు, యూనిట్ ఇన్‌చార్జ్ కారుకోల దృశ్యంత్ సీనియర్ నాయకులు రోనంకి కృష్ణంనాయుడు, చిట్టీ సింహాచలం అర్జలా విష్ణు, రామారావు బర్రి తవిటమ్మ, నల్లన వెంకునాయుడు, ఉప్పాడ అప్పలరెడ్డి, గ్రామ నాయకులు నందుపిల్లి జోగారావు, చక్క మల్లేష్, వరహి వరలక్ష్మి, ముఖ్య నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట నియోజకవర్గ 'బిజేపి' కన్వీనర్‌గా భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర-నరసన్నపేట : నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ కన్వీనర్‌గా గొద్దు భాగ్యలక్ష్మిని, కో-కన్వీనర్‌గా, కరుకోల రామారావును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజేపి అధ్యక్షురాలు, నందమూరి పురంధేశ్వరి నియమించారు. రానున్న శాశనసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నియోజకవర్గ బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర, జిల్లా బిజేపి అధిష్టానానికి, నాయకులకు వీరు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియచేశారు. అడ్వకేట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న భాగ్యలక్ష్మీ, గత 2019 శాశనసభ ఎన్నికల్లో నరసన్నపేట నియోజకవర్గ బిజెపి ఎమ్మెల్యేగా పోటీ చేయటం పాఠకులకు తెలిసిందే.

గురువు నిరంతర విద్యార్థి

- విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులదే

- రాజీవ్ గాంధీ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ జగదీశ్వర్‌ని సన్మానించిన అధ్యాపకులు సహచర సిబ్బంది

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: గురువుగా విద్యాభివృద్ధికి ఎనలేని సేవలు ఈ మూడు సంవత్సరాలు రాజీవ్ గాంధీ యూనివర్సిటీ కి అందించిన సేవలు గణనీయమనీ ఓఎస్‌డీ సుధాకర్ బాబు తెలియచేశారు. ఆంధ్ర యూనివర్సిటీ లో ప్రొఫెసర్ గా చేసి తదుపరి రాజీవ్ గాంధీ యూనివర్సిటీ కి డైరెక్టర్ గా ఈ మూడు సంవత్సరాలు సేవలు అందించడం చాలా ఆనందంగా ఉందని ఇక్కడ వాతావరణం చాలా ఆహ్లాదకరమై ఉంటుంది అని చెప్పారు. రాజీవ్ గాంధీ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ జగదీశ్వర్ రావు అన్నారు. క్రమశిక్షణ, జ్ఞానం పెంపొందించి, లక్ష్యం పట్ల వారికి స్పష్టమైన అవగాహన కలిగించి, వారిని కార్యసాధకులుగా తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర వెలకట్టలేనిదని పేర్కొన్నారు. 'మాతృదేవోభవ.. పితృదేవోభవ.. ఆచార్యదేవోభవ' అనే సూక్తి, తల్లిదండ్రుల తర్వాత గురువులకు ఉన్న ప్రాధాన్యం తెలియజేస్తున్నదని అన్నారు. రాజీవ్ గాంధీ యూనివర్సిటీ అధ్యాపక, అధ్యాపకేతర, విద్యార్థులు డైరెక్టర్ ప్రొఫెసర్ జగదీశ్వర్ రావు ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డి సుధాకర్ బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ ఆసిరినాయుడు, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ రవి, ఉపాధ్యాయులు, పీఆర్‌వో మామిడి షణ్ముఖ సహచర ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల విద్యాతోనే దేశ పురోభివృద్ధి

విశాలాంధ్ర-పోలాకి: నేటి బాలల విద్యా తోనే దేశం పురోభివృద్ధి చెందుతుందని స్థానిక హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు ఆర్ లక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక శాఖ గ్రంథాలయం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశం అభివృద్ధి చెందాలంటే నేటి బాలల నుంచి విద్య పటిష్టంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. అందుకు బాల్యం నుంచే విద్య పునాదులు నిర్మించాలని కోరారు. పటిష్టమైన విద్యాతోనే బాల్యం దశ కొనసాగాలని అందుకు దేశం పురభివృద్ధికి దోహదం కాగలదని ఆకాంక్షించారు. శాఖ గ్రంథాల అధికారిని కింజరాపు మానస అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చిత్రలేఖనం వకృత్వ పోటీలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. హై స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రంథాలయ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలు

విశాలాంధ్ర-మెళియాపుట్టి : మెళియాపుట్టి మండల కేంద్రంలో గల శాఖగ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను గ్రంథాలయ అధికారిని అనురాధ నిర్వహించారు. శుక్రవారం మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో 56వ వారోత్సవాల్లో భాగంగా జరిగిన చిత్రలేఖన పోటీలకు శాఖ గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి బి. కుమారురాజు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడున్న విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

శ్రీశయన కుల గణనకు అధికారులు సహకరించాలి

విశాలాంధ్ర-సోంపేట : జిల్లాలో పెద్ద జనాభా కలిగిన శ్రీశయన సామాజిక వర్గానికి సంబంధించి కులగణనకు అధికార యంత్రాంగం సహకరించేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్‌కు సామాజికవర్గ పెద్దలు శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. శ్రీకాకుళంలోని జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, రాష్ట్ర శ్రీశయన కార్పోరేషన్ చైర్మన్ పంకజాక్షిదేవ్, రాష్ట్ర కార్పోరేషన్ డైరెక్టర్లు దేవాడ మోహనరావు, మంగి ధనలక్ష్మి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లోని శ్రీశయన వర్గీయులను కుల గణనలో గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశయన సంఘ పెద్ద బంజు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శిగా రవికుమార్

విశాలాంధ్ర-సోంపేట : శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శిగా సోంపేటకు చెందిన మద్దు రవికుమార్‌ను నియమించారు. ఈమేరకు టీడీపీ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు కూన రవికుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. రవికుమార్‌ను స్థానిక టీడీపీ నాయకులు పుష్పగుచ్చం వేసి అభినందించారు.

లోక్అదాలత్‌పై న్యాయమూర్తుల సమావేశం

విశాలాంధ్ర-సోంపేట : డిసెంబర్ 9న జరగబోయే లోక్అదాలత్ కార్యక్రమంపై మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 6వ అదనపు న్యాయమూర్తి పి.భాస్కరరావు స్థానిక అధికారులతో సమావేశం నిర్వహించారు. జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎ.రాముతో కలిసి సోంపేట, మంసద, కంచిలి, బారువ పోలీస్ అధికారులతో సమావేశమై చర్చించారు.

నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్న అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : నాగుల చవితి సందర్భంగా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, టెక్కలి శాసనసభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం విజయవాడ రాణిగారి తోటలోగల శ్రీ నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మనం ఏ ప్రాంతంలో ఉన్న మన సాంప్రదాయ పద్ధతులు మానకూడ దని ఆయన సూచించారు. ఆయనతో పాటు పలువురు టీడిపి నాయకులు ఉన్నారు.

ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండలం కొత్తపేటలో ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న ప్రపంచ మత్స్యకార దినోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షులు సూరాడ మోహనరావు, జిల్లా బి.సి సెల్ ప్రధాన కార్యదర్శి గోవింద్ పాపారావు కోరారు. శుక్రవారం గుణిపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మత్స్యకారుల ఐక్యతతో పాటు సమస్యలుపై పోరాటం కోసం మంచి వేదికని, మత్స్యకారులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వారితో పాటు గుల్ల చిన్నారావు, కంబాల దానేష్, కోడ రామన్న, ఆకుల పాపారావు, సాతుపిల్లి కామేష్, దుర్గారావు, పెరిమల్లి సాయిలు ఉన్నారు.

నాగేంద్రుని ఆశీస్సులు అందరిపై ఉండాలి

విశాలాంధ్ర-అరసవల్లి: ఆ పరమేశ్వరుని కంఠాభరణం అయిన నాగేంద్రుని ఆశీస్సులు అందరి పైన ఉండాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ కోరుకుంటూ నాగుల చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం నగర పరిధిలో నాగుల చవితి సందర్భంగా పుట్టలో పాలు పోసి, ఆ నాగేంద్రుని పూజించారు. అలాగే డాక్టర్ డానేటి శ్రీధర్ జిల్లా ప్రజానీకానికి మరియు అధికారులకు ప్రజాప్రతినిధులకు నాయకులకు మరియు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు నాగుల చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.